


రంజాన్ వేళలు
ఇఫ్తార్ - సోమవారం
సాయంత్రం - 6:36
సహర్ - మంగళవారం
ఉదయం - 4:42



తనిఖీలతో జాగ్రత్త!

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు వాహనాలు, సాధారణ తనిఖీలను ముమ్మరం చేశారు. రూ.50వేలకు మించి నగదుతో ఎటైనా వెళ్తున్నా, ఇదే మొత్తానికి మించి బంగారు, వెండి ఆభరణాలను, కొత్త వస్తువులను తరలిస్తున్నా వాటికి సంబంధించి తగిన ఆధారాలను తనిఖీ అధికారులకు చూపాల్సి ఉంటుంది. లేదంటే నగదు, వస్తువులను అధికారులు సీజ్ చేస్తున్నారు. ఎన్నికల్లో ఖర్చుల వివరాల సేకరణ, అక్రమంగా నగదు తరలింపు నివారణలో భాగంగానే అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ప్రజలు ఎవరైనా అధిక మొత్తంలో నగదు తరలిస్తున్నా, బంగారం, వెండి లేదా ఇతర విలువైన వస్తువులను రవాణా చేస్తున్నా తగిన బిల్లులను వెంట ఉంచుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఆధారాలు లేని నగదు, వస్తువులను సీజ్ చేసి జిల్లా ఎన్నికల కమిటీకి అప్పగిస్తున్నారు.

జిల్లాలో ముమ్మరంగా వాహనాల చెకింగ్



- ఎక్కడికక్కడ ఎన్నికల చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఆధారాలు లేని నగదు, బంగారం, సామగ్రి జప్తు
- రూ.50వేలకు మించి పట్టుబడితే ఆదాయపన్ను శాఖకు ఆధారాలు చూపించాల్సిందే!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): వ్యాపార అవసరాలు, ఇతర పనుల కోసం పెద్ద మొత్తంలో నగదు తీసుకెళుతున్నారా? అయితే లోక్‌సభ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలి. భారీ మొత్తంలో డబ్బు వెంట తీసుకెళ్లడం తప్పు కాదు. కానీ ఎన్నికల నేపథ్యంలో ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది.. దేనికి వెచ్చించేందుకు తీసుకెళ్తున్నారు.. చెప్పే కారణాలకు తగిన ఆధారాలు ఉన్నాయా? వంటి అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. లేదంటే ఎన్నికల అధికారులు నగదును సీజ్ చేసి తగిన ఆధారాలు చూపితేనే రిలీజ్ చేస్తారు. నగదు/బంగారం తరలింపులో నిబంధనలు పాటిస్తే ఇబ్బందులుండవు గానీ లేదంటే తంటాలు తప్పవు! జిల్లాలో తనిఖీలు పోలింగ్ ముగిసే వరకూ కొనసాగుతాయి. ఈ క్రమంలో రూ.50వేలకు మించి నగదు వెంట ఉంచుకునే వారు కచ్చితంగా ఆ డబ్బుకు లెక్కలు చూపించాల్సి ఉంటుంది. డబ్బులు ఎక్కడికి తీసుకు వెళుతున్నారు... ఆ డబ్బులు ఎక్కడ నుంచి అందాయి.. ఏ అవసరాలకు తీసుకెళుతున్నామనే విషయాలపై పూర్తి స్థాయి ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఆ విషయంలో పోలీసులు సంతృప్తి చెందకుంటే స్వాధీనం చేసుకున్న డబ్బులు సీజ్ చేసి కేసును ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు సిఫారసు చేస్తారు. డబ్బు యజమానులు ఆదాయ పన్ను శాఖ అధికారులకు ఆధారాలు చూపితే డబ్బు రిలీజ్ చేస్తారు.

రూ.10లక్షలు దాటితే..

లెక్కాపత్రం సరిగ్గానే ఉన్నా రూ.10లక్షల కంటే ఎక్కువ సొమ్ము తరలిస్తూ పట్టుబడితే జిల్లా స్థాయి కమిటీ ఆ డబ్బుపై ఆదాయ పన్ను శాఖ నోడల్ అధికారికి సమాచారం ఇస్తున్నారు. దీంతో సంబంధీకులకు ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్ తాఖీదులు జారీ చేస్తుంది. వివరణ సంతృప్తికరంగా ఉంటే డబ్బు ఇచ్చేస్తారు. లేదంటే పన్ను మినహాయించుకొని మిగతా డబ్బు ఇస్తారు.

రంగంలోకి తనిఖీ బృందాలు

ఎన్నికల కోడ్ రాగానే పోలీసులు, రెవెన్యూ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెయలెన్స్ టీమ్‌లు రంగంలోకి దిగాయి. వీరి తనిఖీల్లో నగదు భారీగా పట్టుబడుతోంది. ఇందులో సామాన్యుల నగదే ఎక్కువ. డబ్బు, సామగ్రి పట్టుబడితే ఎక్కడికి తరలిస్తున్నారో ఆరా తీస్తున్నారు. ఆధారాలు సరిగ్గా లేకుంటే జప్తు చేసి ఇన్‌కమ్‌ట్యాక్స్ శాఖకు అప్పగిస్తున్నారు. అయితే నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువుల లెక్కలు సరిగ్గా ఉన్నా కొన్ని సందర్భాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది దారితప్పే అవకాశముంది. ఈ ఉద్దేశంతోనే ఎన్నికల కమిషన్ జిల్లా స్థాయి కమిటీని నియమించింది. తనిఖీ బృందాలు పట్టుకున్న డబ్బు విషయాన్ని జిల్లా స్థాయి కమిటీ దృష్టికి తీసుకువెళ్లాలి. ఈ కమిటీ నిర్ణయం మేరకు డబ్బులు రిలీజ్ చేస్తారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తూ తనిఖీ బృందాలకు చిక్కితే దానిపై రిటర్నింగ్ అధికారికి, పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తారు. జిల్లా కేంద్రంలోని ఎన్నికల విభాగం ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి కమిటీకి నివేదిస్తుంది. ఒక వేళ పత్రాలు సరిగ్గా ఉండి, ఆ డబ్బు ఎన్నికల వ్యవహారానికి సబంధం లేదని నిర్ధారించుకుంటే రిటర్నింగ్ అధికారి సూచనతో వదిలేస్తున్నారు. ఏమాత్రం అనుమానమొచ్చినా దీనిపై జిల్లా స్థాయి కమిటీ సుమోటాగా విచారణ జరుపుతుంది. ఈ తరహా సంఘటనలపై రోజువారీ నివేదికలు రూపొందిస్తుంది. ఒక వేళ సొమ్మును జప్తు చేస్తే అప్పీలుకు వెళ్లేందుకు అవకాశం ఇస్తుంది. ఎవరికి అప్పీలు చేసుకోవాలనే విషయాన్ని డబ్బు తరలిస్తున్న వ్యక్తులకు ఈ కమిటీ తెలియజేస్తుంది.



చేవెళ్లలో వాహన తనిఖీలు

ఐటమ్	సీజైన వాటి సంఖ్య	పరిమాణం	విలువ(రూ.)
నగదు	38	-	1,63,40,750
గోల్డ్/సిల్వర్	01	5.3కిలోలు	4,18,700
లిక్కర్	458	9,068.75లీటర్లు	52,13,270
డ్రగ్స్	23	715.63కిలోలు	3,17,75,731
ఇతరాలు	-	-	1,42,2000
మొత్తం	520	-	5,51,70,451

పట్టుబడుతున్న నగదు, బంగారం, మద్యం

పార్లమెంట్ ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో చెక్‌పోస్టులు, ప్రధాన చౌరస్తాల్లో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో సీజ్ చేసిన వాటిలో నగదు, బంగారం, లిక్కర్, ఇతర వస్తువుల విలువ మొత్తం రూ.5,38,90,451 ఉంటుంది. అందులో రూ.1,63,40,750 నగదు, రూ.4,18,700 విలువైన బంగారం, రూ.52,13,270 విలువగల మద్యం, రూ.3,17,75,731 విలువ గల డ్రగ్స్, రూ.1,42,2000 విలువగల ఇతర వస్తువులు ఉన్నాయి.

భక్తిశ్రద్ధలతో షబ్-ఎ-ఖదర్ వేడుకలు



మసీదులో షబ్-ఎ-ఖదర్ వైశిష్ట్యం గురించి వివరిస్తున్న ఇమామ్

ఆమనగల్లు, ఏప్రిల్ 7 : ఆమనగల్లులోని జామా మసీదు, మహ్మదీయ మసీద్, అహ్మదే హిలాల్‌లో ఆదివారం షబ్-ఎ-ఖదర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహ్మదీయ మసీద్‌లో నిర్వహించిన వేడుకలకు కొత్తకోటకు చెందిన పీర్ హజ్రత్ అబెద్ హుస్సేన్ ఖాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లింలు శనివారం రాత్రి మసీద్‌లలో జాగరణ చేసి ప్రార్థనలు నిర్వహించారు. అబెద్ హుస్సేన్ ఖాద్రి, ఆయా మసీద్‌ల ఇమామ్‌లు వాహెద్, అతీఫ్ షబ్-ఎ-ఖదర్ ప్రాముఖ్యతను ముస్లింలకు వివరించారు. ఈ భూమిపై ప్రతీ ముస్లిం అల్లా చూపిన సన్మార్గంలో పయనించాలని సూచించారు. చెడు మార్గాలను ఆచరించొద్దన్నారు. ఖురాన్ పఠించిన హఫీజ్, మౌజమ్‌లను కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్‌ఖాద్రీని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమాల్లో ఆయా మసీద్ కమిటీల అధ్యక్షులు మహ్మద్ మాసూమ్, అబ్దుల్ ఖాదర్‌ఖాద్రి, మొయినుద్దీన్, నాయకులు సయ్యద్ ఖలీల్, ఎంఏ ఖలీల్, ఖాదర్, మహబూబ్ అలీ, రహీమ్, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రచండ భానుడి భగభగ!

- ఘన్‌పూర్‌లో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఎండ వేడికి జనం బెంబేలు



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 7 : భానుడు భగ్గుమంటూ నిప్పుల కొలిమిని తలపిస్తున్నాడు. ఉదయం 8దాటితే చాలు సుర్రుమంటున్నాడు. మధ్యాహ్నం నిప్పులు చిమ్ముతున్నాడు. సాయంత్రం 5 దాటినీ శాంతించడం లేదు. తీవ్ర వడగాలులు వీస్తున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఆదివారం మేడ్చల్ జిల్లా ఘన్‌పూర్‌లో 42.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి మంగల్‌పల్లిలో 41.6డిగ్రీలు, వికారాబాద్ జిల్లా యాలాల్‌లో 42.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

జనం బేజారు.. తల్లడిల్లుతున్న పశువులు

యాచారం: ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే భానుడి భగభగలతో జనం బెంబేలెత్తుతున్నారు. ఆదివారం యాచారంలో 40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలకు పశువులు తల్లడిల్లుతున్నాయి. చిరు వ్యాపారులు, రైతులు, ఉపాధి, వ్యవసాయ కూలీలు ఎండను తట్టుకోలేక ఉదయం 11లోపు ఇళ్లకు చేరుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు రావాలని, పండ్ల రసాలు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. దుకాణాలు, హోటళ్లు వెలవెలబోతున్నాయి.



తమ్మలోనిగూడ గేటు సమీపంలో నిర్మానుష్యంగా మారిన రహదారి

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు


యాచారం, ఏప్రిల్ 7 : మండలంలోని తక్కళ్లపల్లి గుట్టలపై గల శ్రీ వేంకటేశ్వర స్వామి, శివాలయాల్లో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కాగా మాసశివ రాత్రి సందర్భంగా శివాలయంలో జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, సావిత్రమ్మ దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, పూజారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారిని సత్కరించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ వచ్చే వానకాలంలో పుష్కలంగా వర్షాలు కురిపించి ప్రజల కష్టాలను తీర్చాలని పరమేశ్వరుడిని వేడుకున్నట్లు చెప్పారు. కరువు పరిస్థితుల నుంచి కాపాడాలని పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె.నారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణయాదవ్, నరేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, అమృతసాగర్, కేసరిసాగర్, వెంకటేష్ ఉన్నారు.



పరమేశ్వరుడికి పూజలు చేస్తున్న కోదండరెడ్డి దంపతులు ◄

బీఆర్‌ఎస్‌లో చీలికలు.. కాంగ్రెస్‌లో చేరికలు!

- మహేశ్వరంలో హస్తం కళకళ.. కారు వెలవెల!





నాగారం మాజీ సర్పంచ్ రాములునాయక్‌కు కండువా కప్పుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి(ఫైల్)

మహేశ్వరం, ఏప్రిల్ 7 : మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ చీలికలు, పేలికలుగా మారుతోంది. పాలక కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు రోజురోజుకూ ఊపందుకుంటున్నాయి. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు మహేశ్వరం జడ్పీటీసీ, జడ్పీ ఛైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరి వారి అనుచరులనూ చేర్చుకోవడంలో బిజీబిజీగా ఉన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరి ఇదే పార్టీ టికెట్ పొందడంతో ఎంపీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ మూడో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వెయ్యి ఏనుగుల బలాన్ని సంతరించుకుంది. మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు హస్తం పార్టీలోకి క్యూ కడుతున్నారు. కందుకూరు బీఆర్‌ఎస్ జడ్పీటీసీ జంగారెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ వైస్ ఛైర్మన్ భవానీవెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ తేజశ్వినిశ్రీకాంత్, మహేశ్వరం ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీతఅంద్యానాయక్, తుమ్మలూరు మాజీ సర్పంచ్‌లు ఎం.సురేఖకరుణాకర్‌రెడ్డి దంపతులు, నాగారం మాజీ సర్పంచ్ రాములునాయక్, తుక్కుగూడ మాజీ సర్పంచ్ డి.సుధాకర్ తదితరులు ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రైతు సమితి జిల్లా కమిటీ కూన యాదయ్య, మన్సాన్‌పల్లి ఎల్లమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ మురళీధర్‌రెడ్డి, ఘట్టుపల్లి మాజీ సర్పంచ్ రాఖేష్‌రెడ్డి, మహేశ్వరం పలువురు మాజీ ఉపసర్పంచ్‌లు, తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మ, తుక్కుగూడ, జల్పల్లి మున్సిపాలిటీలు, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్ల ప్రజాప్రతినిధులు పదవులకు, రాజీనామాలు చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో గెల్చిన బీఆర్‌ఎస్‌ను ఇక్కడ దెబ్బకొట్టాలనే కాంగ్రెస్ వ్యూహాత్మకంగా నాయకులను చేర్చుకుంటోంది. మహేశ్వరం, కందుకూరు మండలాల బీఆర్‌ఎస్ మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నారు. పలువురు బీజేపీ కార్యకర్తలు సైతం కాంగ్రెస్‌లో చేరతారనే వార్తలొస్తున్నాయి. కేఎల్లార్, తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ అనితారెడ్డిలు లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించి మరో మూడు నెలల్లో రానున్న పంచాయతీ/పరిషత్/మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ పదవులను హస్తగతం చేసుకునేలా పావులు కదుపుతున్నారు. స్థానిక సంస్థల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న వారు ఎక్కువ మంది కారు పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. రానున్న ఐదేళ్ల మహేశ్వరాన్ని కాంగ్రెస్ అడ్డాగా మార్చేందుకు నాయకులు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారు. రాజకీయ ఉద్దండురాలైన ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఇదంతా చూస్తూ మౌనంగా ఉండడం బీఆర్‌ఎస్‌లో దుమారాన్ని రేపుతోంది. సబిత మౌనం వెనక మర్మమేంటో? అని ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. కాగా పార్లమెంట్ ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేయాలని కాంగ్రెస్ కంకణం కట్టుకుంది.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం

- దేశ ముఖ చిత్రాన్ని మార్చేసేలా కాంగ్రెస్ మేనిఫెస్టో రూపకల్పన
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 7 : దేశ ప్రజలకు సామాజిక, ఆర్థిక న్యాయం చేసి, రాజ్యాంగ విలువలను పరిరక్షించాలన్నదే కాంగ్రెస్ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మోదీ పదేళ్ల పాలనలో ధ్వంసమైన ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించి రాజ్యాంగాన్ని కాపాడే దిశగా కాంగ్రెస్ ప్రణాళిక ప్రకారం పనిచేస్తోందని చెప్పారు. ఆదివారం కడ్తాలలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, డీసీసీ కార్యదర్శి బీక్యనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు భాస్కర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోతో దేశ ముఖచిత్రం మారి, సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగుతాయన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికలతో కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం వస్తుందని, దీంతో 'పాంచ్ న్యాయ్' విధానాలను అమలు చేస్తుందన్నారు. మహిళలు, యువత, రైతులకు అన్ని సామాజిక వర్గాలకు మేలు చేసేలా కాంగ్రెస్ మేనిఫెస్టోను రూపొందించిందన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా కుల, ఆర్థిక గణన చేపడుతుందని తెలిపారు. దేశాభ్యున్నతికి కాంగ్రెస్ చారిత్రక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. రిజర్వేషన్లను 50శాతానికి పెంచడంతో పాటు ఉపాధి పథకంలో రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచుతాం అన్నారు. రైతులకు రుణ మాఫీ చేసి బీమా కల్పిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనా దక్షతతో వంద రోజుల్లోనే రాష్ట్రంలో అద్భుత విజయాలు సాధించామన్నారు. సమావేశంలో ఎంపీటీసీ రాములు, నాయకులు బిచ్యానాయక్, వేణుగోపాల్, శంకర్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పాల్గొన్న నాయకులు

ప్రమాదకరంగా పురాతన ఇళ్లు



కుర్మిద్దలో కూలుతున్న పాడుబడ్డ ఇల్లు

- పాములు, తేళ్లు ఇతర విష కీటకాలకు ఆవాసాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- కూల్చివేతలను అడ్డుకుంటున్న యజమానులు
- పాడుబడ్డ ఇళ్లతో గ్రామస్తులకు పొంచి ఉన్న ముప్పు

యాచారం, ఏప్రిల్ 7: మండలంలోని వివిధ గ్రామాల్లో పురాతన ఇళ్లు ప్రమాదకరంగా మారడంతో ఆయా గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మండల పరిధి పలు గ్రామాల్లో శిథిలమైన పురాతన ఇళ్లు 120 వరకు ఉన్నాయి. గతంలో ప్రభుత్వం పురాతన ఇళ్లను కూల్చాలని, ఇందుకు పంచాయతీ నిధులను వాడుకోవాలని ఎంపీడీవో, ఎంపీవోలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ పని పూర్తి స్థాయిలో చేయలేదు. కుర్మిద్ద, నందివనపర్తి, గున్గల్, మేడిపల్లి, చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, పిల్లిపల్లి, చింతపట్ల, ధర్మన్నగూడ, మాల్, కొత్తపల్లి తదితర గ్రామాల్లో ఎప్పుడు కూలి మీద పడతాయోననే స్థితిలో ఉన్న ఇళ్లు చాలానే ఉన్నాయి. వీటిల్లో కొన్నింట్లో కుటుంబాలు నివాసం ఉంటుండగా చాలా ఇళ్లను వదిలేశారు. మేడిపల్లిలో ఉన్న రెండు పురాతన భవనాలు ఒక్కోటి అర ఎకరంలో విస్తీర్ణంలో ఉన్నాయి. వాటిలో పాములు, తేళ్లు తదితర కీటకాలు నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. పాడుబడ్డ ఇళ్లతో గ్రామస్తులకు, వాటి సమీపంలో వారికి సైతం ముప్పు పొంచి ఉంది. గతంలో ఈ ఇళ్లను కూల్చేందుకు అధికారులు యత్నించగా వాటిలో సామాన్లు ఉన్నాయని, పాడుబడ్డ ఇండ్లను కూల్చొద్దని పాతిళ్ల యజమానులు అభ్యంతరం చెప్పారు. దీంతో అధికారులు వాటిని కూల్చలేదు. తాటిపర్తిలో ఉన్న పాత ఇండ్లను కూల్చేందుకు అధికారులు యత్నించగా ఇళ్లను కూల్చొద్దని కోర్టు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. దాంతో ఆ ఇళ్లను అధికారులు కూల్చలేకపోయారు. ఇదిలా ఉంటే పాడుబడ్డ ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలను జోరుగా కొనసాగిస్తున్నారు. పత్తాలు ఆడడం, మద్యపాన కేంద్రాలుగా, వివాహేతర సంబంధాలకు అడ్డాలుగా చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ధర్మన్నగూడలో పాడుబడ్డ ఇంటిని కూల్చేందుకు అధికారులు యత్నించగా యజమాని అడ్డుపడడంతో అధికారులు వెనుదిరిగారు.

అధికారులు ఆదేశిస్తే పాతిళ్లన్నీ కూలుస్తాం



మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న పాత ఇళ్లు కూల్చేయాలని అధికారులు ఆదేశిస్తే వాటిని నేలమట్టం చేస్తాం. పాడుబడ్డ ఇళ్లతో స్థానికులకు ముప్పే. జనం జాగ్రత్తగా ఉండాలి. ఇప్పటికైనా పాత ఇళ్ల యజమానులు వాటిని కూల్చి ప్రమాదాలు జరగక్కుండా చూడాలి. వానకాలంలో వాటిల్లోకి ఎవరూ వెళ్లొద్దు.

- ఉమారాణి, ఎంపీవో, యాచారం

'ఉపాధి' కూలి పెంపు


మోత్కుర్‌లో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో మహేశ్‌బాబు

దోమ, ఏప్రిల్ 7: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.272 నుంచి 300 వరకు ఏప్రిల్ 1 నుంచి పెంచినట్లు ఎంపీడీవో మహేశ్‌బాబు తెలిపారు. మండలంలోని మోత్కుర్ గ్రామంలో ఆదివారం కూలీలతో ఆయన మాట్లాడారు. మండలంలో 13521 ఉపాధి కూలీలు ఉన్నారని, పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కూలీలు అధిక సంఖ్యలో పనికి వచ్చేవిధంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్ఎంఎస్ యాప్ ద్వారా కూలీల హాజరుశాతాన్ని నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

● మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఏప్రిల్ 7 : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని గణపతి గార్డెన్స్‌లో ఆదివారం కాంగ్రెస్ కొత్తూర్ మున్సిపాలిటీ, కొత్తూర్, నందిగామ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి వంశీచంద్‌రెడ్డి, శంకర్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాసుందర్‌రెడ్డి, కొత్తూర్, నందిగామ మండలాల అధ్యక్షులు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహా, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, కుమారస్వామిగౌడ్, నాయకులు శివశంకర్‌గౌడ్, తులసీరాంనాయక్, గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల యువత ఆసక్తి కనబర్చాలి

● పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి



బహుమతులు అందజేస్తున్న జంగారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 7 : క్రీడల పట్ల యువత ఆసక్తిని కనబర్చాలని మాజీ జడ్పీటీసీ, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి అన్నారు. మూడు రోజులుగా మండలంలోని దెబ్బగూడ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం సాయంత్రం స్థానిక నాయకులు ఎల్మటి దేవేందర్‌రెడ్డి, జిట్ట రాజేందర్‌రెడ్డితో కలిసి జంగారెడ్డి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి గెలుపొందిన క్రీడాకారులకు ఏనుగు జంగారెడ్డి రూ.లక్ష నగదు, ద్వితీయ బహుమతి గెలుపొందిన వారికి ఎల్మటి దేవేందర్‌రెడ్డి, రూ.లక్ష నగదు, తృతీయ బహుమతి గెలుపొందిన వారికిజిట్ట రాజేందర్‌రెడ్డి రూ.50వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ ఎల్మటి లక్ష్మీ, మండల పరిషత్ కో-ఆప్షన్ మెంబర్ ఎండీ సులేమాన్, మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి, మాజీ ఉపసర్పంచ్ చంచు గణేష్, నాయకులు దయాకర్‌రెడ్డి, బండ నర్సింహ, తీగల జగదీశ్వర్‌రెడ్డి, మనోహర్‌గుప్తా, జైపాల్‌నాయక్, డి.జంగయ్య, శ్రీనివాస్‌గుప్తా, రాఘవేందర్‌గుప్తా, నీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెంచుడు.. నరుకుడు!



బషీరాబాద్ ప్రధాన మార్గంలో నరికివేసిన చెట్టు

బషీరాబాద్, ఏప్రిల్ 7: హరితహారం కార్యక్రమంలో భాగంగా రహదారుల పక్కన నాటిన మొక్కలను పెంచి.. చెట్లుగా మారిన క్రమంలో నరికివేస్తున్నారు. బషీరాబాద్-తాండూరు ప్రధాన ఆర్‌అండ్‌బీ మార్గంలో కాశీంపూర్ సమీపంలో హరితహారం కింద ఫారెస్ట్ అధికారులు మొక్కలను నాటించి, గత ఐదారేళ్లుగా సంరక్షిస్తూ వచ్చారు. అయితే రహదారి పక్క నుంచి సమాంతరంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగాలకు తగిలి కరెంట్ సరఫరాకు ఆటంకంగా మారుతున్నాయనే కారణంతో విద్యుత్‌శాఖ సిబ్బంది చెట్ల మొదళ్లతో కొమ్మలను ఇలా నరికివేశారు. అటవీశాఖ అధికారులు లక్షల రూపాయలు వెచ్చించి ఓ పక్క మొక్కలు పెంచుతుంటే విద్యుత్‌శాఖ వాటిని నరికివేస్తుండటంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తాటిముంజలకు కేరాఫ్ అంతారం



తాటిముంజలు విక్రయిస్తున్న వ్యాపారులు

కులకచర్ల, ఏప్రిల్ 7: అంతారం గ్రామం తాటి ముంజలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గ్రామంలోని దాదాపు వందకు పైగా కుటుంబాలు తాటి ముంజలు విక్రయించి ఉపాధి పొందుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఈ తాటి ముంజలను వీటిని పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఇష్టపడతారు. ముఖ్యంగా వేసవి కాలంలోనే విరివిగా లభిస్తాయి. వేసవి సెలవులకు గ్రామీణ ప్రాంతాలకు వచ్చే వారు తాటి ముంజలు కచ్చితంగా తింటారు. ఇవి మండలంలోని అంతారం, తిరుమలాపూర్, ఇప్పాయిపల్లి గ్రామాల్లో ఎక్కువగా లభిస్తాయి. ఇక్కడ ముంజలంటే తెలియని వారుండరు. వాటిని ప్రతీ ఒక్కరు ఇష్టపడతారు. ఇప్పుడు పట్టణాల్లో కూడా లభిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి తీసుకువెళ్లి పట్టణాల్లో అమ్మకాలు చేస్తున్నారు. తాటి ముంజలు శరీరంలోని చక్కెర, ఖనిజ లవణాలను సమతుల్యం చేస్తాయి. తాటి మంజలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇక్కడి నుంచి పరిగి, పాలమూర్, హైదరాబాద్, రాయచూర్, గుల్బర్గ, సంగారెడ్డి, సదాశివపేట తదితర ప్రాంతాలకు తరలించి అమ్ముతుంటారు. తాటిముంజల విక్రయంతో రెండు నెలల పాటు ఉపాధి పొందుతారు.



భారీ మెజార్టీతో రంజిత్‌రెడ్డి గెలుపు తథ్యం

చందానగర్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి అధిక మెజార్టీతో గెలవడం తథ్యమని ఎంబీసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జైపాల్ అన్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు చెందిన వడ్డెర సామాజిక వర్గ నాయకులతో సమీక్షా సమావేశం చందనగర్‌లో ఆది వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమైందన్నారు. దేశంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపిస్తే ఈ ప్రాంత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. రంజిత్‌రెడ్డి కోసం కార్యకర్తలు సైనికుల పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, వడ్డెర సంఘం నాయకులు లింగయ్య, రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు అనంతయ్య, సెక్రటరీ కృష్ణయ్య, కార్యదర్శి విఠల్ తదితరులు పాల్గొన్నారు.



ఫహీమ్ ఖురేషీకి ఖర్జూర తినిపిస్తున్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి



మాట్లాడుతన్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జైపాల్

ఇఫ్తార్ విందులో రంజిత్‌రెడ్డి

రాజేంద్రనగర్ (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల విద్యాసంస్థల వైస్‌చైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషీ ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లిలోని ఎస్ఎన్‌సీ కన్వెన్షన్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందులో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ప్రముఖక్రికెటర్, కాంగ్రెస్ నాయకుడు అజహారుద్దీన్‌లతో పాటు పలు కార్పొరేషన్ల చైర్మన్లు బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఒబేదుల్లా కొత్వాల్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై ప్రచారం

తాండూరు, ఏప్రిల్ 7: పార్లమెంటు ఎన్నికల్లో ఎన్నికల నియామవళిని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అధికార యాంత్రాగం చర్యలను ముమ్మరం చేసింది. ఎన్నికల నియామవళి, ఓటుహక్కు వినియోగం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే ఫిర్యాదు ఎలా చేయాలి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వంటి అంశాలను వివరిస్తూ తాండూరు మున్సిపాలిటీలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఈ విషయాలైన సి-విజిల్, ఎంససి యాప్ వంటి వాటిని వివరించే బ్యానర్లను కట్టారు. పట్టణంలో ప్రధాన కూడళ్లు అయిన ఇందిరాచౌక్, శివాజీచౌక్, విలియమూన్ చౌరాస్తా, భదేశ్వర్‌చౌక్, శాంతమహాల్ చౌరస్తా, రైల్వే స్టేషన్‌రోడ్డు, కొడంగల్ రోడ్డు, మార్గాల్లో ఈ బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఓటు హక్కును వివరిస్తూ 5కె రన్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఈ బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లఘించే పార్టీలపై ఫిర్యాదులు చేసేందుకు సి-విజిల్ యాప్‌ను వినియోగించుకోవాలని బ్యానర్ల ద్వారా ఓటర్లకు వివరించారు.



తాండూరులో ఫ్లైఓవర్‌పై ఏర్పాటు చేసిన బ్యానర్



ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

తాండూరురూరల్, ఏప్రిల్ 7: మండలంలోని ఐనెల్లి శివారులోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం జరిగింది. మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 6వతరగతి నుంచి 10వ తరగతుల్లో ప్రవేశానికి 169 మంది విద్యార్థులుదరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 133మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 36మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 7 నుంచి 10వ తరగతుల వరకు ప్రవేశానికి 265 మంది దరఖాస్తు చేసుకోగా 200మంది పరీక్ష రాశారు. 65 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న విష్ణుమూర్తి

జాతీయ స్థాయి పోటీల్లో అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థుల ప్రతిభ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 7: ఐఐటీ-హైదరబాద్ ఫోర్త్ విద్యార్థి 24గంటల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులు సత్తాచాటారు. యూనివర్సిటీలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెలిచిన విద్యార్థులను అనురాగ్ యూనివర్సిటీ సీఎస్‌సీ హెచ్‌వోడీ జి.విష్ణుమూర్తి బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జాతీయస్థాయి హ్యాకథాన్‌లలో పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయ్‌కుమార్, అచ్యుత్, అభిలాష్‌రెడ్డి, రౌత్ సందీప్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసినా అక్రమ వసూళ్లు?

● పరిగి తైబజార్‌లో గుత్తేదారు ఇష్టారాజ్యం ● అధికారుల ఆదేశాలు బేఖాతర్ ● వసూలు చేసే డబ్బు ఎవరెవరి ఖాతాల్లోకి?

పరిగి, ఏప్రిల్ 7 : పరిగి మార్కెట్‌లో నిర్వహిస్తున్న తైబజారులో డబ్బులు అక్రమంగా వసూలు చేస్తున్నారు. తైబజారుకు వేలం నిర్వహించని కారణంగా డబ్బులు వసూలు చేయకూడదని అధికారులు చెప్పినా.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ దృష్ట్యా తైబజార్‌కు వేలం నిర్వహించలేదు. గతేడాది తైబజార్ వసూళ్లకు సంబంధించి గుత్తేదారు గడువు మార్చి 31తో ముగిసింది. ఏప్రిల్ ఒకటి నుంచి మళ్లీ వేలం నిర్వహించి డబ్బులు తైబజార్‌లో డబ్బు వసూలు చేసుకునేందుకు అవకాశమిస్తారు. కాగా, ఎన్నికల కోడ్ కారణంగా తైబజార్‌కు రైతులు, వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని పత్రికలు, నోటీస్ బోర్డుల ద్వారా మునిసిపల్ అధికారులు ప్రచారం కల్పించారు. అయినా, ఇదంతా పట్టించుకోకుండా ఏప్రిల్ ఒకటి తర్వాత కూడా గతంలోని గుత్తేదారు డబ్బులు దర్జాగా వసూలు చేస్తున్నాడు. సాధారణ రోజుల్లోనే వేలల్లో వసూలవుతుండగా.. సంత జరిగే శుక్ర, శని వారాల్లో భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నారు. అధికారులు వద్దన్నారు కదా? అని పలువురు రైతులు, వ్యాపారులు నిలదీస్తే తూకం వేసే బాట్లతో దాడులకు దిగిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. కాగా, ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు,రైతులు వాపోతున్నారు. వారం రోజులుగా పరిగి మార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా తైబజారుకు సంబంధించి డబ్బులు వసూలు చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, ఈ డబ్బులో అధికారులకు కూడా వాటా ఇస్తున్నామని వసూలు చేసినవారే చెబుతుండడం గమనార్హం.



పరిగిలో కొనసాగుతున్న సంత

బలవంతంగా వసూలు చేస్తున్నారు



అధికారులుతైబజారుకు సంబంధించి డబ్బులు ఇవ్వకూడదని చెబుతున్నారు. అయితే, ఆచరణలో అందుకు విరుద్ధంగా ఉంది. గతంలో వసూలు చేసినవారే తిరిగి వసూలు చేస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు తాము డబ్బు చెల్లించమని చెబితే బెదిరిస్తున్నారు. కొందరిపై తూకం చేసే బాట్లతో దాడికి దిగుతున్నారు.

- ఆకుల కృష్ణ, చిరువ్యాపారి, పరిగి

తైబజారు డబ్బులు ఎవరికీ ఇవ్వొద్దు



పరిగి మునిసిపల్ పరిధిలో వ్యాపారస్తులు, చిరువ్యాపారులు, రైతులు తైబజారుకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. గుత్తేదారు తైబజార్ వసూళ్ల కాల పరిమితి మార్చి 31తో ముగిసింది. ఎవరు కూడా డబ్బులు చెల్లించవద్దు. డబ్బులు అక్రమంగా వసూలు చేసినవారిపై చర్యలు తీసుకుంటాం. మునిసిపల్ కార్యాలయంలో ఫిర్యాదు కూడా చేయవచ్చు.

- వెంకటయ్య, మునిపిపల్ కమిషనర్, పరిగి

కాంగ్రెస్ వాగ్దానాలను ప్రజలు నమ్మరు

చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 7: ఇటు రాష్ట్రంలో.. అటు దేశంలోనూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న వాగ్దానాలను ప్రజలు నమ్మడంలేదని మాజీ ఎంపీ, బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండావిశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు.వికారాబాద్ మండలం పీలారం,రాళ్లచిట్టంపల్లి, ద్యాచారం, గొట్లిముక్ల, కామారెడ్డిగూడ, పాతూరు, సిద్దులూరు గ్రామాల్లో ఆదివారం ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎక్కడికి వెళ్లినా బీజేపీకి బ్రహ్మారథం పడుతున్నారని అన్నారు. మరోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటు కోసం సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆదరణ కోల్పోయిందన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌లో బీజేపీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరూ బీజేపీ వెంట ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ నరేంద్రమోదీనే ప్రధాని

ధారూరు: నరేంద్రమోదీ మళ్లీ భారతప్రధాని అవుతారని, బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజాఆశ్వీరాద యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని మున్నూర్ సోమారం, గడ్డమీది గంగారం, నాగారం, మోమిన్‌కలాన్, ధారూరు గ్రామాల్లో ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీకి పోటీయేలేదన్నారు.గ్రామాల్లో కరెంట్, నీటి సమస్య నెలకొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. గ్రామాల్లో ఉపాధి రోడ్లు, రేషన్ బియ్యం, మరుగుదొడ్ల నిర్మాణం కేంద్ర ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఇక్కడ బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.రమేశ్, నాయకులు పాండుగౌడ్, వివేకానందరెడ్డి, నరోత్తంరెడ్డి, విజయబాస్కర్ రెడ్డి, కేపీ రాజు, రాజేందర్‌గౌడ్, విజయలక్ష్మి, రవీందర్‌గౌడ్, రాఘవేందర్ గౌడ్, సాయిగౌడ్, శ్రీకాంత్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.



చాపలగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కొండా సమక్షంలో బీజేపీలో చేరికలు

ధారూరు మండలంలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు నాయక్‌తో పాటు ఆయన భార్య మాజీ ఎంపీపీ ఉమాపార్వతి ఆదివారం బీజేపీలో చేరారు. వీరితో పాటు కొండాపూర్‌కలాన్, నాగసమందర్, స్టేషన్ ధారూరు, రుద్రారం గ్రామాల తాజా మాజీ సర్పంచులు పరమేష్, చంద్రకళ, రేణుకా, చంద్రమ్మలతో పాటు నాయకులు రాంచందర్, అనిల్, శ్రీనివాస్, రాములు, లక్ష్మారెడ్డిలు బీజేపీలో చేరారు. వీరికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి అభినందనలు తెలిపారు.



ధారూరులో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

కులకచర్ల: కులకచర్ల మండలంలోని చాపలగూడెం, తిరుమలపూర్ గ్రామాల్లో ఆదివారం చేవేళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లతో అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కొండ విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి డాక్టర్ మీరారెడ్డి, పిన్ని డాక్టర్ కల్పన రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి, రామచంద్రయ్య, గోపాల్ పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు కొండా..

చేవెళ్ల : బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మచ్చలేని నాయకుడు అని బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వర్‌రెడ్డి చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదన్నారు. ఆయనపై ప్రత్యర్థులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలన్నారు. చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు దేవుని శర్వలింగం, వెంకట్‌రాంరెడ్డి, నాగరాజుగౌడ్, ఆమర్‌నాథ్‌రెడ్డి, హన్మంత్, కృష్ణ ఉన్నారు.

నేడు పూలపల్లిలో పర్యటన

చేవెళ్ల మాజీ ఎంపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర నేడు చేవెళ్ల నియోజకవర్గంలోని నవాపేట్ మండల పరిధిలోకి చేరుకుంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటోరెడ్డి తెలిపారు. ఆదివారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వర్‌రెడ్డి కొనసాగిస్తున్న ప్రజాఆశీర్వాద యాత్ర నవాపేట్ మండలంలోని పూలపల్లి, నారేగూడ, గంగ్యాడ, మైతాఫ్‌ఖాన్‌గూడ తదితర గ్రామాల్లో సోమవారం కొనసాగుతుందన్నారు. ప్రజలు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎంపీగా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి

రాజేంద్రనగర్ : చేవెళ్ల ఎంపీగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి కోరారు. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ సింఫనీ విల్లాస్‌లో ఆదివారం ఆమె ఓటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకుసేవచేయాలనే సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చారని చెప్పారు. ఎంపీగా ఉన్నప్పుడు చేవెళ్ల అభివృద్ధికి ఆయన కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎస్.మల్లారెడ్డి, ఎస్.విజయ్‌కుమార్, మొంద్ర సంగీత, గౌరీశంకర్, కొండా గౌతమిరెడ్డి, పాల్గొన్నారు.కాగా చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. డివిజన్‌లోని బాబుల్‌రెడ్డినగర్‌లో ఆదివారం కార్పొరేటర్ ఆధ్వర్యంలో వ్యాపార సముదాయాల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

ప్రధాని మోదీకి అండగా నిలవాలి: అనితారెడ్డి

హైదర్‌నగర్: దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోదీకి అందరూ అండగా నిలవాలని చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి సోదరి అనితారెడ్డి అన్నారు. ఆదివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్‌లో విశ్వేశ్వరరెడ్డిని గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. మణిభూషణ్, అశోక్, నరేష్, శ్రీనివాస్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా నార్సింగ్ గ్రామంలోని అల్కాపూర్ కాలనీలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుకోసం కొండా సంగీతారెడ్డి ప్రచారం నిర్వహించారు. పార్కులో వాకర్స్‌తో మాట్లాడారు.

ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ

చేవెళ్ల, ఏప్రిల్ 7 : శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఈనెల 30వ తేదీ లోపు ఆస్తి పన్ను చెల్లించినట్లయితే 5 శాతం రాయితీ వర్తింస్తుందని కమిషనర్ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నుపై ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం రాయితీని ప్రకటించిందన్నారు. ఈ అవకాశాన్ని శంకర్‌పల్లి పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

చేవెళ్ల, ఏప్రిల్ 7 : తాగునీటి సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాయలంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా నీటి ఎద్దడి నివారణ నిమిత్తం శంకర్‌పల్లి మున్సిపాల్ పరిధిలోని ఏ ప్రాంతంలోనైనా తాగునీటి సమస్య తలెత్తితే సత్వర పరిష్కారానికి హెల్ప్‌డెస్క్ నెంబర్ 9704328088కు సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

రేపు 'ఆరోగ్యధామ్' ఏర్పాటు


మాదవన్‌జీ

మహేశ్వరం, ఏప్రిల్ 7 : సమాజంలో సత్యం, ధర్మం న్యాయం ఎల్లప్పుడు ఉండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలనే ఉద్దేశంతో మండల పరిధిలో అవేర్‌లో ఆరోగ్యధామ్ పేరిట ఆసుపత్రిని ఏర్పాటు చేయబోతున్నామని అవేర్ సంస్థ చైర్మన్ మాదవన్‌జీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు దశాబ్దాలుగా ఎన్నోరకాలుగా సేవలందిసున్న అవేర్ సంస్థ ఇప్పుడు ఆరోగ్య కేంద్రాన్ని ఉగాది సందర్భంగా రేపు (మంగళవారం) ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ఆరోగ్య కేంద్రంలో ఆయుర్వేదిక్, యునాని, హోమియో, వెల్‌నెస్, యోగా వైద్య సేవలను అందిస్తామని వైద్య సేవలపై 25 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చూచించారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సిహెచ్. కేతన్, సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి నారపంగ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మరకత శివాలయం అభివృద్ధికి విరాళం


సుధీర్‌జైన్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చేవెళ్ల, ఏప్రిల్ 7 : శంకర్‌పల్లి మండల పరిధి చందిప్ప గ్రామంలోని మరకత శివాలయం అభివృద్ధి కోసం హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపార వేత్త సుధీర్‌జైన్ రూ.1 లక్ష 111 విరాళం అందించారు. ఆదివారం మరకత శివాలయాన్ని ఆయన సందర్శించి స్వామి వారిని దర్శించుకుని దేవాలయం అభివృద్ధి కోసం తన సొంత డబ్బులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ సదన్నగౌడ్, సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వారు సూచించారు.

వ్యవసాయానికి 'ఉపాధి'ని అనుసంధానం చేయాలి


లక్ష్మినర్సింహారెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 7 : ఉపాధి హామీ పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మినర్సింహారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రధాని మోదీ, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు 'ఎక్స్'(ట్విటర్) వేదికగా ఆయన విన్నవించారు. ఎన్నికల అనంతరం కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆయన వారికి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ రంగానికి ఉపాధి పనులను అనుసంధానం చేయడం వల్ల కూలీలకు ఉపాధి లభించడంతో పాటు రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గి ఆర్థిక ఇబ్బందులు తొలుగుతాయన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న నాయకులు

తలకొండపల్లి, ఏప్రిల్ 7 : మండల పరిధిలోని వెల్జాల గ్రామానికి చెందిన రమేశ్ అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. ఆయన రూ.వేలు సమకూర్చగా బాధిత కుటుంబానికి స్థానిక నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు శ్రీకాంత్ యాదవ్, యాదయ్య, పెంటయ్య, భాస్కర్, అంజి, అబిలాష్, ఆంజనేయులు, చెన్నయ్య, జంగయ్య, రవి, ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


మాట్లాడుతున్న దశరథ్‌నాయక్, తదితరులు

కడ్తాల్, ఏప్రిల్ 7 : ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలమై ప్రజా విశ్వాసం కోల్పోయిందని, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే మాజీ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ నేతలపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దశరథ్‌నాయక్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అద్భుత విజయాలు సాధించిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో వైస్‌ఎంపీపీ ఆనంద్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జోగు వీరయ్య, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, ప్రియరమేశ్, మంజుల చంద్రమౌళి, ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, నాయకులు తులసీరామ్, హరిచంద్‌నాయక్, కృష్ణయ్య, సాయిలు, పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

ఆమనగల్లు/మాడ్గుల : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్‌లో ఏర్పాటు చేసినట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, మాడ్గుల బీఆర్‌ఎస్ నాయకుడు పోలే మహేష్ ఆదివారం వేరు వేరు ప్రకటనల్లో తెలిపారు. సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు.

మంచి పనులకు చిరస్థాయి కీర్తి


గూడూరు నారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, తదితరులు

కడ్తాల్ , ఏప్రిల్ 7 : జీవితకాలంలో చేసిన మంచి పనులు మరణానంతరం కూడా ప్రజల్లో కీర్తించబడుతాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి జక్కుల చిత్త రంజన్‌దాస్ అన్నారు. ఆదివారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి తండ్రి నారాయణరెడ్డి సంస్మరణ సభ కడ్తాల మండల కేంద్రంలోని గూడూరు కేశవరెడ్డి గార్డెన్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మెరుగు రమేశ్‌రెడ్డి, కార్యదర్శి సూదిని రాంరెడ్డి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, అనురాధపత్యానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బీచ్యనాయక్, జగన్, కిషన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మోతాలాల్, శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ లు రాములు, ఉమావతి, నిర్మలాదేవి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చేగూరి వెంకటేశ్, గురిగళ్ల లక్ష్మయ్య, మల్లేపల్లి జగన్, శంకర్, సూదిని కొండల్‌రెడ్డి, గూడూరు గోపాల్‌రెడ్డి, వేణుగోపాల్, హన్మనాయక్, బాస్కర్ రెడ్డి, జోగువీరయ్య, చల్లా రాంరెడ్డి, దెంది శశిధర్‌రెడ్డి, శ్రీను, శ్రీకాంత్‌రెడ్డి, నరేశ్ నాయక్, మంకి శ్రీను, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, వెంకటేశ్వర్‌రావు, పురుషోత్తంరెడ్డి, కృష్ణనాయక్, శ్రీశైలం, చందోజీ, కృష్ణారెడ్డి, లీలాలక్ష్మారెడ్డి, కిశోర్‌రెడ్డి, జయమ్మ, అరుణ, స్వప్న, శరత్, ధీరజ్, ఉదయ్, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధతో ఉత్తమ ఫలితాలు


ఫలితాలను విడుదల చేస్తున్న సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 7 : తమ యూనివర్సిటీలో చదివే విద్యార్థులపై అధ్యాపక బృందం ప్రత్యేక శ్రద్ధ చూపడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. మండల పరిధి హిమాయత్ నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో ఈ ఏడాది జరిగిన పరీక్షల ఫలితాలను ఆదివారం విడుదల చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ విద్యాసంస్థలో లేని విధంగా తమ యూనివర్సిటీలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. హాస్టల్ విద్యార్థులకు ఎలాంటి లోటు పాట్లు కలుగకుండా జాగ్రత్తలు పాటిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మొయినాబాద్‌కు కిషన్‌రెడ్డి రాక

చేవెళ్ల, ఏప్రిల్ 8 : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని బీజేపీ బూత్ నాయకుల సమావేశం మొయినాబాద్ మండల పరిధిలోని జేపీఎల్ గార్డెన్‌లో సోమవారం జరుగబోతుందని, ఈ సమావేశానికి ముఖ్యఅతిగా కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రాబోతున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలోని బూత్, బీఎల్‌ఏల సమావేశం చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం అవుతుందని చెప్పారు. బూత్ స్థాయి నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కొత్తూరుకు డీకే అరుణ..

కొత్తూర్, ఏప్రిల్ 7: కొత్తూర్ మున్సిపాలిటీతో పాటు, కొత్తూర్, నందిగామ మండలాల బీజేపీ విస్తృత స్థాయి సమావేశం స్థానిక శ్రీలక్ష్మీ బంకెట్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు, సమావేశానికి బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ హాజరు కాబోతున్నట్లు ఆ పార్టీ పార్లమెట్ నియోజకవర్గ కో-కన్వీనర్ అమడపురం నర్సింహాగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.00గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఆమె పాల్గొని దిశా. నిర్దేశం చేస్తారని చెప్పారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కుల, మత భేదం లేకుండా ముందుకు సాగాలి

● మైనార్టీ నాయకుడు ఇక్రమోద్దీన్


ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చేవెళ్ల, ఏప్రిల్ 7 : కుల, మత భేదాభిప్రాయం లేకుండా అన్ని రంగాల్లో ప్రజలు ముందుకు సాగాలని చేవెళ్ల మండల సీనియర్ మైనార్టీ నాయకుడు సయ్యద్ ఇక్రమోద్దీన్ అన్నారు. అన్ని మతాల భాగస్వామ్యంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. మండల పరిధిలోని మాల్కాపూర్ గ్రామంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింల కోసం ఆదివారం ఆయన ప్రత్యేకంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైందన్నారు. ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లిం ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయని చెప్పారు. వివిధ పార్టీలు, మైనార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


కాశిగూడలో పండ్లు పంపిణీ చేస్తున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ

మాడ్గుల : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మాడ్గుల మండలంలోని కాశగూడెం, ఇర్విన్ గ్రామాల ముస్లింలకు ఐక్యత ఫౌండేషన ఆధ్వర్యంలో ఆదివారం ఖర్జూర పండ్లు పంపిణీ చేసినట్లు ఆ ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని చెప్పారు.

ఆత్మ పథకం రద్దుతో అన్నదాతల ఇబ్బందులు

● సాగులో మెలకువలు చెప్పే వారు కరువు ● అవగాహప సదస్సులు, కార్యక్రమాలు లేవు

యాచారం, ఏప్రిల్ 7 : వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తేవడంతో పాటు అన్నదాతకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం కోసం 2014లో నాటి టీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) పథకాన్ని అమలు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు వివరించడం దీని ముఖ్య ఉద్దేశం. వ్యవసాయాధికారులు మారుమూల గ్రామాల్లో తిరిగి పంటల సాగు చేయడం, రైతులను చైతన్య పరచడం, హరిత విప్లవంపై అవగాహన సదస్సులు నిర్వహించడం ఈ పథకం ప్రకారం పని చేయాలి. కానీ ఆరేళ్లుగా ఈ పథకంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించక పోవడంతో ఆత్మ పథకాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేయడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆత్మ పథకానికి నిధులు ఇవ్వడం మానేసింది. ఈ పథకం అమలు కోసం నాటి ప్రభుత్వం కొంతకాలం భాగానే నిధులు అందించడంతో పాటు రైతులకు పంటల సాగుపై శిక్షణ, అవగాహన సదస్సులు పెట్టింది. ఈ పథకంలో భాగంగా రైతులకు పంటల సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రతి నియోజకవర్గాన్ని క్లస్టర్‌గా ఏర్పాటు చేసి దానికి ఓ అధికారిని నియమించారు. ప్రతి మండలంలో ఆత్మ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా గత ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా రద్దు చేసింది. ఈ పథకం రద్దుతో సాగుపై సూచనలు ఇచ్చేవారు లేకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆత్మ అధికారుల విధులు

ఆధునిక పద్ధతుల్లో సాగు చేసే పద్ధతులపై రైతులను ఆత్మ అధికారులు చైతన్యం చేయాలి. వ్యవసాయశాఖతో పాటు ఉద్యానవన, పట్టు, పశుసంవర్ధక, మత్స్య శాఖలకు సంబంధించిన రైతులు చేపట్టాల్సిన అంశాలపై క్షేత్రపరిశీలన చేసి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలి. వ్యవసాయ రంగ నిపుణులు, శాస్త్రవేత్తలను గ్రామాలకు తీసుకువెళ్లి పంటల సాగులో ఆధునిక యంత్రాల వాడకంపై అవగాహన కల్పించాలి. ఆధునిక పద్ధతులతో పంటలు పండించే విధానాలపై గ్రామాల్లో రైతులకు శిక్షణ ఇప్పించడం, చీడపీడల నివారణపై తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించాలి.

నిధులు లేవు.. కమిటీలు లేవు..

ఈ పథకానికి గత ప్రభుత్వం కొంతకాలం పాటు భాగానే నిధులు ఇచ్చింది. కానీ ప్రస్తుతం నిధుల జాడే లేదు. ఆత్మ క్లస్టర్ అధికారులకు ఏడు నెలలుగా వేతనాలు కూడా ఇవ్వడం లేదు. ఆత్మకు సంబంధించిన జిల్లా స్థాయి కమిటికి కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కన్వీనర్‌గా ఉంటారు. డివిజన్ చైర్మన్‌ను కలెక్టర్ నామినేట్ చేస్తారు. క్షేత్రస్థాయిలో మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణ చేస్తారు. ఇందుకోసం అవసరమైన నిధులను కలెక్టర్ చొరవతో వ్యవసాయ శాఖ జేడీఏతో నిధులు ఇవ్వాల్సి ఉన్నా నిధులు ఇవ్వడం లేదు. నిధులు లేకపోవడంతో మండల, డివిజన్ స్థాయి అధికారులు ఈ పథకాన్ని అమలుకు చర్యలు తీసుకోలేకపోతున్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి


కొండాపూర్‌లో వాహన తనిఖీ చేస్తున్న ఘట్‌కేసర్ సీఐ సైదులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 7 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతీఒక్కరు ఎన్నికల నియమావళిని పాటించాలని ఘట్‌కేసర్ సీఐ సైదులు అన్నారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి కొండాపూర్, అవుషాపూర్‌లలో ఆదివారం ఆయన వాహనాల తనిఖీలు చేపట్టారు. వరంగల్-హైదరబాద్ జాతీయ రహదారి అవుషాపూర్ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి 24/7 తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల నియమావళి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాండూరులో త్వరలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు

తాండూరురూరల్, ఏప్రిల్ 7 : త్వరలోనే తాండూరులో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. తాండూరులోని సాయిమేధ పాఠశాలలో ఆదివారం టీయూడబ్ల్యూజే-ఐజేయూ డివిజన్ అధ్యక్షుడు పెరుమాళ్ల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి రామకృష్ణల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని తాండూరు పట్టణం, తాండూరు, యాలాల, బషీరాబాద్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులందరికీ బీమా సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తపాలా శాఖలో అమలవుతున్న బీమా పథకాన్ని నమోదు చేసేందుకు నిర్ణయించామన్నారు. దీని ద్వారా రూ.10లక్షల వరకు బీమా వర్తిస్తుందన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జర్నలిస్టు సమన్వయ కమిటీ సభ్యులుగా తాండూరు టౌన్ మహేష్, యాలాల జావెద్, బషీరాబాద్ శివకుమార్, పెద్దేముల్ పాండు, తాండూరు మండలం శాంతులను నియమించారు.

ప్రధాని మోదీ నాయకత్వంలోనే బీసీలకు న్యాయం

శామీర్‌పేట, ఏప్రిల్ 7: ప్రధాని మోదీ నాయకత్వంలో బీసీలకు అన్నిరంగాల్లో న్యాయం జరుగుతుందని మల్కాజ్‌గిరి నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. తూంకుంటలోని మొగుళ్ల రామకృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్లో మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్, జిల్లా నాయకుడు బుద్ధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మున్నూరుకాపు సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ, జాతీయ ఓబీసీ చైర్మన్ డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. వారిని మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం నాయకులు అభినందిస్తు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొంతం దీపిక, సింగం సత్తయ్య, సాయిబాబా, అరుణ, దివాకర్, పద్మయ్య, శ్రీనివాస్, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా అంతాయిపల్లి పరిధిలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈటల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన 60 మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: కేంద్రంలో బీజేపీ చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి తమ పార్టీ మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేసి గెలుపించాలని ఈటల రాజేందర్ సతీమణి జమున అన్నారు. ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మహిళ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు అమరం సరస్వతి, హంస రాణి కృష్ణగౌడ్ పాల్గొన్నారు

క్రైం కార్నర్

మహిళ హత్య కేసు నిందితుడి రిమాండ్


నిందితుడు

శంషాబాద్ రూరల్ ఏప్రిల్ 7 : అక్రమ సంబంధం, ఆర్థిక పరమైన మనస్పార్థల కారణంగా ఓ మహిళను దారుణంగా హత్య చేసిన నిందితుడిని ఆదివారం రిమాండ్‌కు తరలించిన్నట్లు శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పాల్మాకుల గ్రామానికి చెందిన గూడెపు యాదమ్మ(40)తో సంఘీగూడ గ్రామానికి చెందిన దేశపాగ శంకరయ్య కొన్ని రోజులుగా అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. కాగా యాదమ్మ నిందితుడికి రూ.2.5 లక్షలు అప్పుగా ఇచ్చింది. అప్పు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని పలు మార్లు అతడిని నిలదీసింది. దీంతో మనస్పర్థలు రావడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. కాగా ఈ నెల 27న యాదమ్మ బంధువుల ఇంటికి వెళుతున్నానని చెప్పి శంషాబాద్‌లోని రాళ్లగూడకు వచ్చింది. అదే రోజు తిరిగి పాల్మాకులకు వెళుతున్నానని బంధువులకు చెప్పి వెళ్లింది. శంషాబాద్ బస్టాండ్‌లో బస్సు ఎక్కి పెద్దషాపూర్ దగ్గర దిగింది. అక్కడి నుంచి నిందితుడు యాదమ్మను బైకుపై ఎక్కించుకుని సంఘీగూడలో ఉన్న తన పొలం దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ కూడా డబ్బుల విషయంలో మరోసారి గొడవ పడ్డారు. కోపోద్రిక్తుడైన శంకరయ్య యాదమ్మ తలపై పారతో గట్టిగా కొటడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. జేసీబీతో గుంత తీసి తన పొలంలోనే మృతదేహాన్ని పాతి పెట్టాడు. ఈ నెల 28న ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదయింది. యాదమ్మ పెద్దషాపూర్ వరకు వెళ్లిందని దర్యాప్తులో తెలియడంతో పోలీసులు కేసును ఈ నెల 5న శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు బదిలి చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు యాదమ్మ ఫోన్‌కాల్ చివరి సారిగా ఎవరికి వెళ్లిందని పరిశీలించగా అది శంకరయ్యకు వెళ్లింది. నిందితుడిని అదుపులోకి పోలీసులు తమదైన శైలితో విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. ఆదివారం మెజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అర్ధరాత్రి దొంగల బీభత్సం

●రూ.40 వేల నగదు, రెండు తులాల బంగారం చోరీ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

నందిగామ, ఏప్రిల్ 7 : నందిగామ మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన రెండు ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. లంకాల వినితమ్మ అనే మహిళ ఇంటి తాళం విరగ్గొట్టి బీరువాలోని రూ.35 వేల నగదు, 2 తులాల బంగారం, చాకలి లక్ష్మమ్మ అనే మహిళ ఇంట్లో రూ.5 వేలు చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన అగ్గి మహేష్‌గౌడ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీకి వెళ్లిన దొంగలు ఆ చుట్టు ప్రక్కల ఇళ్లకు బయటి నుంచి గడి వేసి చోరీకి ప్రయత్నించారు. అక్కడ ఏమీ దొరకకపోవడంతో వస్తువులను చిందరవందర చేసి వెళ్లిపోయారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పరిశీలించారు. సంఘటన స్థలాల్లో క్లూస్‌టీం వివరాలు సేకరించింది. ఒకేరోజు రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ


బాధితురాలు లక్ష్మి

కీసర రూరల్, ఏప్రిల్ 7: మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు చోరీకి గురైంది. ఈ ఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య వివరాల ప్రకారం.. కీసర మండల కేంద్రంలో నివాసముంటున్న మెట్టు లక్ష్మి స్థానికంగా వెంకట సాయి థియేటర్ ఎదురుగా ఉన్న బాలాజీ స్వీట్‌హౌజ్‌లో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. కాగా స్వీట్ హౌజ్ సమీపంలోని యజమాని ఇంటి నుంచి టీ తీసుకొస్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెండలోంచి నాలుగు తులాల పుస్తెలతాడును అపహరించుకెళ్లారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దుండగుల ఆచూకీ కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

వికారాబాద్, ఏప్రిల్ 7: రైలుకింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ పట్టణం రామయ్యగూడ గ్రామానికి చెందిన మగ్గ మనోహర్(24) పశువులు మేపుతూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ మధ్యనే పశువులు మేపడం మానేసి కూలి పనులకు వెళ్తుండేవాడు. మద్యానికి బానిసైన మనోహర్ రాత్రి ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లాడు. ఉదయం 7గంటల ప్రాంతంలో మనోహర్ రైలుకింద పడి మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. వారు అక్కడికి వెళ్లి చూసి మనోహర్‌గా గుర్తించారు. అయితే రాత్రి గుర్తుతెలియని రైలుకింద పడి మనోహర్ ఆత్మహత్య చేసుకుని ఉంటారని గ్రామస్తులు అంటున్నారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వికారాబాద్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ టీచర్..


గంగబాయి(ఫైల్)

తాండూరు రూరల్, ఏప్రిల్ 7: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన అంగన్‌వాడీ టీచర్ చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని జినుగుర్తి గ్రామానికి చెందిన గంగబాయి(36) అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. కొంతకాలం కిందట ఆమె భర్త మృతిచెందడంతో మనోవేదనకు గురైంది. ఈక్రమంలో గంగబాయి జీవితంపై విరక్తిచెంది కల్లుకు బానిసైంది. ఈనెల 1వ తేదీన గంగబాయికి కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగింది. కుటుంబీకులు వెంటనే ఆమెను తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ఆసుపత్రికి రెఫర్ చేశారు. గంగబాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కరన్‌కోట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

కత్తులతో ఇరువర్గాల దాడి.. కేసు నమోదు

వికారాబాద్, ఏప్రిల్ 7: మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ధన్నారం తండాలో శనివారం రాత్రి ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా మద్యం మత్తులో మరో వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో కత్తులతో దాడికి పాల్పడటంతో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. వారిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేఏస్తున్నట్లు వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపారు.